కథా నిలయం
శ్రీకాకుళం

# విజయదశమి

రైలు కూత వేసింది.

"ఈ రోజు విజయ దశమి. మంచి రోజని బయలుదేరావు. జాగ్రత్తగా వెళ్ళమ్మా. వెళ్ళగానే ఫోన్ చెయ్ తల్లీ!" కదులుతున్న రైలు డబ్బా కిటికీలోంచి తల్లి కళ్లలోని మంచుతెరలు శ్రావణి కంటబడినై. చెప్పిన మాటనే మళ్లీ మళ్లీ చెబుతున్న మాతృహృదయం, మమకారం మనసును కదిలించినై.

"నా కూతురు పిరికిదేమి కాదు లేవోయ్" తండ్రి చెయ్యి మీసాల మీదికెల్తూంటే- శ్రావణి గుండె గోడల మీంచి పాకుకొచ్చిన నవ్వు పెదాల మీద దోబూచులాడింది.

"అలాగేనమ్మా! ఇక మీరుండండి. మీ ఆరోగ్యం జాగ్రత్త!" కిటికీ లోంచి చెయ్యూపింది. ముక్కుపుడక తళుక్కుమంది.

"మీ నాన్నకేం! మిల్ట్రీలోంచి రిటైరైంది మొన్ననేగదా! గుండ్రాయిలాగుంటారు గాని నీ ఆరోగ్యం జాగ్రత్త తల్లీ... ఉట్టి మనిషివి కూడా కాదు గదా!" తండ్రివైపు మూతులు తిప్పి తనవైపు చెయ్యూపింది తల్లి. దూరం పెరగడంతో మాటలు స్పష్టంగా వినబడ్డం లేదు. పైగా ప్లాట్‌ఫాం నిండా ప్రయాణీకుల రొద.

"వెళ్ళగానే ఫోన్ చేయ్ శ్రావణీ!" తండ్రి గొంతు గట్టిగా వినబడింది. ఎంత మిల్ట్రీ ఆఫీసరైతే ఏం? తల్లిని ఎద్దేవా చేసి తాను గూడా అదేమాట చెబుతున్న నాన్న కడుపుతీపి కళ్ళను తడిచేసింది.

కాలం లాగే రైలు గూడా వెనక్కు తిరిగి చూడకుండా ముందుకు పరుగెడుతోంది. పక్కసీటు వాళ్ళనోసారి పరకాయించి చూసింది. ఎవరి మాటల్లో వారున్నారు. సూటుకేసు సీటుకిందికి తోసి వెనక్కు ఒరిగి కూచుంది.

తానొస్తున్నానని శ్రీవారికి చెబుదామంటే.... ఇంటి ఫోన్ పలుకలేదేమిటి? ప్రవీణ్ ఎటుబోయిండో! షాపులో ఎలాగూ ఉండడు. అయ్యాగారికెన్ని రాచకార్యాలో! వెళ్లింతర్వాత చెవి మెలేసి అడిగి ఆయనగారి పనినట్టాలి. ఇటు చెవి మెలేస్తూంటే అటు కుయ్యోమొర్రో అంటుంటాడు. అప్పుడు చూడాలి. అయ్యగారి వాలకం.... కనులవిందుగా, వినసొంపుగా ఉంటుంది.

ప్రవీణ్... అందగాడు చలాకి మనిషి. అంతటి ప్రేమ పూజారితో జీవితం పంచుకోవడం... తన అదృష్టమే. అమ్మానాన్నలు లేరటా. అయిన వాళ్లెవ్వరూ అందుబాటులో లేరటా. అయితే ఏం? చదువుకున్నవాడు... తనంటే పడి ఛస్తాడు. పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నాడు. గదా!

ఎంత చదువుకున్నా, తానూ ఓ ఆడదేగదా! ఏ ఆడదానికైనా భర్త ఆప్యాయతాను రాగాలను మించిన సిరులింకేముంటాయి?... ఆ శ్రీమన్నారాయణుని దయవల్ల తన జీవితంలో చెప్పుకోదగిన చీకూ చింతలేవీ లేవు. మంచుకొండల్లో... కార్గిల్ కనుమల్లో...

దేశ సరిహద్దుల్ని కంటికి రెప్పలా కాపాడుతున్న దేశభక్తుడు నాన్న... పెద్ద మిల్ట్రీ ఆఫీసర్. మధ్యరకం కుటుంబీకులైన మావయ్యల కనుసన్నల్లో అమ్మా, తమ్ముడు, తానేమో... సిటీలో రెండేళ్ల పీ.జి కోర్సు మూణ్రోజుల్లో పూర్తయినట్టనిపించింది. దానికారణం ప్రవీణ్. కోరవయసును అలరించే ఓరచూపులు, మనసుకు గిలిగింతలు పెట్టే మందహాసము.. ఆరోజు... తాను... రోజూ దర్శించుకునే శ్రీమన్నారాయణ దేవాలయంలో కనిపించాడు. గర్భగుడిముందు మూల విరాట్టు కెదురుగా తన పక్కనే నుంచున్నాడు. హారతి టికెట్టు, కొబ్బరికాయ పూజారికందిస్తూ తనవైపు చూస్తున్నాడు.

"మీ గోత్రం, మీ పేరు, మీ భార్య పేరు చెప్పండి." ఇద్దర్నీ కలిపి చూస్తూ అడిగాడు పూజారి.

"గోత్రం భరద్వాజ, పేరు ప్రవీణ్... ఇంకా ఒంటరి పక్షిని. ఆఫ్‌కోర్స్.... జంటకోసం వేట ప్రారంభమైందనుకోండి." అటు చెబుతూ ఇటు తనవైపు చూస్తున్నాడు. చూపులు కావవి, సుధారసపు జిలకరింపులు, సమ్మోహనాస్త్రాలు. ఆ నల్లని మీసం కట్టు కింది తెల్లని చిరునవ్వు అంతరంగ తరంగాలను తాకింది. ఎన్నడూ అనుకోని, చవిచూడని.. సరికొత్త అనుభూతి.

పూజారి చేతినుండి కొబ్బరిచిప్ప అందుకున్నాడు ప్రవీణ్, అందులోని పూవును తనకందిస్తూ.

"ప్లీజ్... ఇది తీసుకోండి. పూవు పురుషుని చెవిలో కంటే పూబోణి జడలో ఉంటేనే అందం చందం. ఏ తోట పూచిందో, ఏ బోటి కోసిందో గాని ఈ పూట ఈ పూవు పరమాత్ముని పాదపూజలో పరవశించింది. మీ జడనలంకరించే అదృష్టం కల్పించండి." అన్నాడు - వినయంగా.

అబ్బో ! భావుకుడే. కాదనలేక పోయింది మనసు.

"ఏయ్ శ్రావణీ!" రూమ్మేటు సేహితురాలు తన చెయ్యిబట్టి లాగింది. "అలస్యంగా వెళ్తే హాస్టల్లో టిఫిన్ ఫట్, క్లాసులో పాఠం కట్... పదవే!" అదోలాచూస్తూ నవ్వింది.

మళ్లీ శనివారం నాడు కన్పించాడు.

"నమస్తే. నా పేరు ప్రవీణ్. పెద్ద బజారులో ఎలక్ట్రానిక్ షాపు యజమానిని." చేతులెత్తి నమస్కరించాడు. తన సంస్కారం ప్రతి నమస్కారం చేయించి, తనను తాను పరిచయం చేసింది.

ఆ చిరు పరిచయమే తొలిప్రేమ బీజమై, మొలకెత్తి మొగ్గదొడిగి మహావృక్షమై... పెళ్లిదాకా వస్తుందని కలలో గూడా ఊహించలేదు.

అవునులే! అనుకోనివి జరిగితేనే గదా ఆ దేవుని ఉనికిని ఎవరన్నా గుర్తించేది. అనుకున్నవన్నీ అలాగే జరిగితే మనిషి దేవుణ్ణి మించి పోతాడు గదా!

కోట్ల రూపాయలతో నిర్మాణమై, భక్తుల కొంగుబంగారమైన శ్రీమన్నారాయణ మందిరము భారతదేశంలో ప్రముఖ కళాక్షేత్రం, సాంస్కృతిక కేంద్రము. ఆధ్యాత్మిక భోధనాలయం. గుడిచుట్టూ... మయుడు మనసు పడి నియమ నిష్టలతో చెక్కిన అపురూప శిల్పాలు... అవి అజంతా ఎల్లోరా కళాఖండాలకేమీ తీసిపోవు. ఇనుప ముక్కలను లాక్కునే బలమైన అయస్కాంతంలా, అంతదూరం నుండే అందరి దృష్టి నాకర్షించే మూలవిరాట్టును దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుండి ఎందరో భక్తులు వచ్చిపోతుంటారు. అంతటి గుడికి దగ్గరలో పీ.జి. హాస్టలుండడం... తన అదృష్టమే. రోజూ పూజాదికాలు కానిదే పచ్చి మంచినీళ్ళు గూడా మింగని అమ్మ తనకాదర్శం. అందుకేనేమో... రోజూ గుడికొచ్చే ప్రవీణంటే తనకంత ఇది కలిగింది.

నాన్న రిటైరై రాగానే తనను సీమంతానికి తీసుకెళ్తూ ఎంత మురిసిపోయాడో! ప్రవీణ్ ఎంత మాటకారో!

"బాబూ! సీమంతానికి తప్పకుండా రావాలి సుమా!" అని నాన్నగారంటే

"అదేంటి మావయ్యా! నేనొక్కడినే రావాలా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"కాదు జామాత గారూ! బంధుమిత్ర సపరివార సమేతముగా వేంచేసి మీకు పుట్టబోయే కుమార శేఖరుణ్ణి మనసారా ఆశీర్వదించి, మాచే నొసంగబడు భోజన తాంబూలాదులను స్వీకరించ గలరని సవినయంగా మనవి చేయనైనది...."

నాన్న మాటలు విని ఎంత నవ్వాడో ప్రవీణ్!

అతి సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే నాన్న నోటి నుండి అలాంటి డైలాగులొస్తాయి.

"మీ గ్రాంధిక భాషా పటిమ అమోఘం" నవ్వాపుకుంటూ "మీరింకా పాతికేళ్ళ బాలాకుమారుడిలాగున్నారంటే నమ్మండి. ఇంత తొందరగా మీకు రిటైర్మెంటెవరిచ్చారో కాని... వాళ్ళను నిలదియ్యాలి" అనేశాడు.

అప్పుడు... ముగ్గురి నవ్వుల పువ్వులతో ఇల్లంతా అభిషేకించబడింది.

అన్నమాట ప్రకారం ప్రవీణ్ తన ప్రాణస్నేహితులు జాన్. ఇబ్రహీంలను వెంటబెట్టుకొని వచ్చాడు సీమంతోత్సవానికి.

జాన్, ఇబ్రహీంలవి... ఎంత మంచి మనసులో ! అది కాదు చెల్లెమ్మా, ఇది కాదు చెల్లెమ్మా అంటూ తనను సొంత చెల్లెలిలా చూసుకుంటున్నారు. వాళ్లిద్దరూ ఏదో ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగులట. ఎక్కడెక్కడో తిరుగుతుంటారు. రోజుకు కొన్ని గంటలన్నా ప్రవీణ్‌తో కలసి గడుపుతారు.

సీమంతానికొచ్చిన ముగ్గురు సంతోషంగా ఇల్లంతా తిరిగారు. బంధువులందరినీ పలుకరించారు. మాటలతో మురిపించారు. జోకులు పేలుస్తూ అమ్మా నాన్నల్ని గూడా నవ్విస్తూ సీమంతోత్సవములో సంబరాలు సృష్టించారు.

మర్నాడు తిరిగి వెళ్ళేముందు -

"ఒరేయ్ ప్రవీణ్! మా చెల్లెమ్మ కాన్పు అయ్యేదాకా ఇక్కడే ఉంటుందిరా. అక్కడికొస్తే నువ్వు అన్ని పనులూ చేయిస్తావు" అన్నాడు జాన్ అన్నయ్య.

అమ్మో! ప్రవీణ్‌ను వదిలి అన్ని రోజులుండగలనా! తన గుండె గుబగుబలాడింది.

"అదేమీ కుదరదురా! అన్ని రోజులు చెల్లెమ్మ ఇక్కడుంటే మనమేమైపోవాలి? చెల్లెమ్మ చేతివంట అమృతం గదా! ఆ అమృతాన్ని ఐదారు రోజులకోసారన్నా రుచి చూడకపోతే వాడిపోయిన వంకాలయమై పోతాముురా" ఇబ్రహీం అన్నయ్య సవరణ ప్రతిపాదించాడు. "అంతదాకా కాదుగానీ కొన్ని రోజులుండనీ."

"సరేరా! ఓ వారం రోజులుండి వస్తుందిలే!" అన్నాడు ప్రవీణ్ నాన్న ముఖ కవళికల్ని జాగ్రత్తగా గమనిస్తూ.

"సారీ బాబూ! రెండు మూడు వారాలుండనివ్వండి!" నాన్న సముదాయింపుకు దిగాధు. "కొద్దిరోజుల్లో మేమో వారం రోజులు ఢిల్లీ వెళ్లి రావాలి. మేము అటు ఢిల్లీ వెళ్తూ ఇటు శ్రావణిని మీ ఇంటికి పంపిస్తాం. ఢిల్లీ నుండి తిరిగి రాగానే మీ అత్తయ్యను పంపిస్తా. మీ దగ్గరో నెలరోజులున్న తర్వాత శ్రావణిని కాన్పుకు తీసుకొస్తుంది." నాన్న టైంటేబుల్ ప్రకటించాడు.

"సరే మావయ్యా! అమ్మా నాన్నల అనురాగానికి నేనెలగూ నోచుకోలేదు. మీలోనే మా అమ్మానాన్నల్ని చూసుకుంటున్నాను. అన్నట్టూ... శ్రావణి మీ ఇంట్లో ఉన్నప్పుడు వారానికో రెండుసార్లైనా మీ ఇంటి కొస్తాను...." ప్రవీణ్ గొంతు గురుగురలాడింది.

"అత్తారింట్లో అదేపనిగా మెక్కుతూంటే మమ్మల్ని మరచిపోతావేమోరా!" జాన్ అన్నయ్య జోక్ విసిరాడు.

."వాడు మరిచిపోతే ఏమవుద్దటా! మనకు మన చెల్లెమ్మ లేదా! గట్టిగా మాట్లాడ్తే వాడే పస్తులుండాల్సొస్తుంది...." ఇబ్రహీం అన్నయ్య కొట్టిపారేశాడు. అందరి మొహాలమీద ఆనందం మెరిసింది.

"మీలాంటి అల్లుడు దొరకడం మా అదృష్టం బాబూ!" ఎవర్నీ అంత సులువుగా మెచ్చుకోని నాన్న నోట ఆ మాట తన నలరించింది.

వెళ్లేముందు ప్రవీణ్, జాన్, ఇబ్రహీంలు సైగలతో ఏవో మాట్లాడుకుంటూ నవ్వుకున్నారు. తన చూపులు ప్రవీణ్ మీదనే నిల్చుండిపోయినై.

"నీ కోసం... స్వాతి చినుకు కోసం చకోర పక్షిలా ఎదురు చూస్తుంటాను శ్రావణీ!" అంటూ కళ్లతో వీడ్కోలు పలికాడు ప్రవీణ్.

భాష విషయంలో మావారు సార్థక నామధేయులు... గుండె గుసగుసలు పెదాలదాకా పాకినై...

రైలు గట్టిగా కూతవేసి, స్టేషన్ రాబోతుంది అనేసింది.

"ఎక్కడిదాకా వెళ్తున్నావమ్మా?" ఎదురు సీట్లో కూచున్నావిడ నుదురు విశాలంగా కనబడింది. ముత్యాల ముక్కుపుడక మెరుపులు ఆ బొట్టుమీద తచ్చాడుతున్నాయి.

రోజంతా క్రికెట్ ఆటలో ఫీల్డింగ్ చేసి అలసిపోయిన క్రీడాకారునిలా - రైలు పరుగులో వేగం తగ్గింది.

"ఏమ్మా... నిన్నే.. ఎక్కడ దిగాలి?" చెయ్యిపట్టి కదిలించిందింది.

"నేనామ్మా..." పైటకొంగు సవరించుకుంటూ చెప్పింది.

"అట్లానా... అయితే... వచ్చేదదే స్టేషను గదా!"

"అవునవును." సూటుకేసు సీటుకింది నుంచి లాగి బయటకు తీసి పట్టుకుంది. మనసు తెరమీద ప్రవీణ్ రూపం ప్రత్యక్షమైంది.

...ఆదివారం గదా! అయ్యగారు ఇంట్లోనే ఉండి ఉంటాడు. త్వరగా వెళ్లి బహువుల్లో బంధించాలి.. గుండె గుహలో చిరునవ్వులు తచ్చాడుతున్నాయి.

రైలు దిగి ఆటోలో ఇంటికి చేరుకునేలోగా... ప్రవీణ్ తియ్యని పలుకరింపులు, కమ్మని మాటలు... ఏవేవో ఊహలు...

ఇంటికి తాళం లేదు. ప్రవీణ్ ఇంట్లోనే ఉన్నాడన్నమాట! గబగబా లోపలికెళ్లింది. మనసు ఆగనంటోంది... సూటుకేసు బీరువా మీదుంచి బెడ్‌రూంలో చొరబడింది. ప్రవీణ్ లేడక్కడ. బయటికొచ్చి పక్కగదిలో కెళ్లబోయింది. గది తలుపు ఓరగా వేసుంది. ప్రవీణ్ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కాళ్లకు బ్రేకులు పడినై.

లోపలున్నదెవరు? ఏం మాట్లాడుతున్నారు? ఆసక్తి కిటికీవైపు నడిపించింది. కిటికీలోంచి అంతా కనబడుతోంది. వినబడుతోంది... జాన్, ఇబ్రహీం అన్నయ్యలతో అయ్యగారు మందు కొడ్తున్నారు.

టీపాయ్ మీద సగం ఖాళీయైన ఫుల్‌బాటిల్, పక్కన సీలు తియ్యని ఫుల్ బాటిల్, వాటికోపక్కన చిప్స్... మరోపక్క చికెన్ ఫ్రై.

"అరె ఇబ్రహీం ! మన ప్రవీణ్‌గాని ఆలోచనలు గమ్మత్తుగుంటయిరా!" జాన్ పెగ్గు వేసుకుని చికెన్ నంజుకుంటున్నాడు. "ఆ ఆర్డీయక్స్‌ను షాప్‌లో దాచేద్దాంరా అంటే వినక తనింటిలోనే దాచుకున్నాడు. శ్రీమన్నారాయణాలయాన్ని శరివారంనాడు పేల్చేద్దామంటే కాదని ఆదివారము.. అదే ఈరోజు సాయంత్రానికి ముహూర్తం పెట్టేసిండు. రాత్రంతా కష్టపడి గుడిలో బాంబులు పెట్టాం గదా! అవేటైంలో పేల్తాయంటే.... మనగ్గూడా చెప్పడు. ఇంతకూ పాకిస్తాన్‌లున్న మన బిగ్‌బాసుగ్గూడా చెప్పిండా లేదా?"

"బిగ్‌బాసుకు చెప్పకపోతే... మనమిక్కడ బెగ్గర్ కంటే అన్యాయమైపోతాం. రిమోట్ కంట్రోల్‌తోని ముందు వాణ్నే లేపేస్తాడు!" మందు గ్లాసులో మంచు ముక్కలేసుకుంటున్నాడు ఇబ్రహీం. "చెప్పురా ప్రవీణ్ ! వాటికే టైం సెట్ చేసినట్టూ !"

శ్రావణి ఒళ్ళు గిల్లిచూసుకుంది. నిజమే! అమ్మబాబోయ్!... అదంతా వాస్తవమే ! నడినెత్తి మీద ఆటంబాంబులు ధాం ధామ్మని పేలిపోయినై.

గుండె ముక్కముక్కలై చిందరవందరైపోతోంది.

ఇదేమిటీ! వీళ్లు.. పాకిస్తాన్ భక్తులా ! అతడు నా భర్తేనా !... కొద్దిసేపు మెదడు మొద్దుబారింది. ఆ తర్వాత అయోమయం. అంతా చీకటిమయం. ఊహు! ధైర్యంగా ఉండాలి. అంతా వినాలి. సర్వశక్తులు కూడదీసుకుని తనను తాను సంభాళించుకుంది.

"అరేయ్! ఇక్కడ గూడా మీరు నా ఒరిజినల్ పేరుతో పిలావాలా?" ప్రవీణ్ మందుగ్లాసందుకున్నాడు.

"నీకీ పేరు బాగుందిరా. కాని.. మా ప్రశ్నకు జవాబివ్వరా... టెన్షన్ భరించేలేక పోతున్నాం." జాన్ సూటిగా చూసిండు.

"వెధవాయల్లారా!" ప్రవీణ్ అలా నవ్వడం ఎప్పుడూ కనబడలేదు" ఈ రోజుల్లో... శనివారం నాటికంటే ఆదివారమే... అదీ సాయంత్రమే గుడికి ఎక్కువ జనాలొస్తున్నారు. ఉద్యోగులు, సగటు కుటుంబీకులెక్కువ ఈ రోజే గుడికొస్తుంటారు. పైగా శనివారం నాడు శ్రీమన్నారాయణ మందిరం చుట్టూ, లోపల బందోబస్తు ఎక్కువగా ఉంటుంది. నా ప్లానుకు మన బిగ్‌బాస్ అప్రూవల్ నిన్ననే వైర్‌లెస్ సెట్లో వచ్చేసింగి. శ్రీమన్నారాయణ టెంపుల్ తక్షణమే పడిపోవాలని ఆదేశం. ఆదివారం సెలవురోజు... ఓ వెయ్యి మందన్నా టెంపుల్లో చావాలి. గదా..." అలవోకగా అనేస్తున్నాడు.

"అవున్నా... ఈ రోజుల్లో మన ఐ.యస్.ఐ. అంటే ఇండియా స్మాషింగ్ ఇండ్రస్ట్రీయే గదా!...." ఇబ్రహీం అనగానే మిగతా ఇద్దరు గ్లాసులెత్తి చీర్స్ కొడుతూ నవ్వుతున్నారు.

అమ్మదొంగల్లారా! మీ అసలు స్వరూపం ఇదా!... శ్రావణి నరనరాన కోపం, ఆవేశం.... ఉప్పెనలా పొంగుకొస్తున్నాయి. వీళ్ళు ఐ.యస్పై...మనుషులన్నమాట! నేను పెళ్లాడిందో దేశద్రోహినా? ప్రవీణ్ ప్రేమంతా నటనా ప్రావీణ్యమా! నరాల్లో రక్తం కుతకుతలాడ్తోంది.

"మామగారి ద్వారా మిల్ట్రీ రహస్యాలు లాగాలని మిల్ట్రీ ఆఫీసర్ కూతురు శ్రావణితో పెళ్ళికి దిగితివి. మీ మామ రిటైరైపోయె. వాని దగ్గర రహస్యాలెట్లా లాగుదామురా?" అటూ ఇటూ చూసి ఇబ్రహీం ఫుల్‌బాటల్ సీలు పళ్లతో తీశాడు.

"రిటైరైతే ఏందటా? ఆ ఫౌజీ ఆఫీసర్ ద్వారానే బోలెడన్ని సీక్రెట్స్ లాగొచ్చు." భళ్లున నవ్విండు ప్రవీణ్. గోలీషోడా సీసా గాలిలో పగిలిన శబ్దమది. ఆ నవ్వులో క్రౌర్యం, రాక్షసత్వం దాగున్నాయి. "చూడుండ్రిరా ! ఈ రోజు సాయంత్రం శ్రీమన్నారాయణ మందిరం మటాషైపోతుంది గదా! ఈ వార్త విని ఆ పిచ్చి శ్రావణి పరుగెత్తుకొస్తుంది..."

"ఆ, ఆ ... పరుగెత్తుకొస్తుంది. నాలుగు నెలల్లో ఓ బేటాను కంటుంది. పెళ్లాం బిడ్డలమీద నీ ప్రేమానుబంధాలు బలపడిపోతాయి... అప్పుడు పాకిస్తాను, ఐయస్పైని మరిచి హిందుస్తాన్‌లోనే అడ్డా బిఠాయిస్తావు. రాముడు మంచి బాలుడు అన్నట్టు - నువు మారిపోయి సారెజహాసే అచ్ఛా హిందుసితా హమారా అని గున్ గునాయిస్తావు. మన బిగ్ బాస్‌కు కోపమొచ్చి నిన్ను లేపెయ్‌మంటాడు. ఇందతా... దూరభారమా లోచించినావా!" జాన్ గొంతులోంచి విస్కీలోపలికి జారుతుంటే వెటకారం రంగరింపులు బయటికొస్తున్నాయి.

"అవున్రా... బాగా ఆలోచించి స్టెప్ తీసుకో ఇప్పుడే!' ఇబ్రహీం హెచ్చరిక. అరక్షణం అలాగే నోరు తెరిచిఉంచి ఆ తర్వాత ఓ పెగ్గు గటగటా తాగేసి అటుఇటూ చూసిండు. ఎవ్వరూ ఆ ప్రాంతములో లేరని నిర్ధారించుకున్నాడేమో - కాళ్ళు బార్లా సాచి సోఫా కొరిగిపోయిండు. "మనం చెయ్యాల్సింది ఇంకా బోలెడుంది. అసెంబ్లీని, మంత్రుల్ని లేపెయ్యాలి. తిరుపతి, శ్రీశైలం మందిరాలను ఖతం చెయ్యాలి... హిందుస్థాన్ పాకిస్థాన్‌లో కలిసిపోవడం.... ఈదేశం ఇస్లామిక్ ఇండియా కావడం... ఈ కళ్లతోనే చూడాలి గదరా!"

"ఓరి నా పిచ్చి దద్దమ్మల్లారా! మీరు ఐ.యస్సైకి పనికిరారు. మీ బుర్రలల్ల బూడిద నిండుతుంది...." ప్రవీణ్ కళ్ళు ఎర్రబారుతున్నాయి.

"అది కాదురా... మనమంతా అరేంజి చేసి శ్రావణి సీమంతానికెళ్ళినప్పుడు ఇక్కడ మనవాళ్ళు పోలీసు యస్పీని ఖతం చెయ్యలేదా? నీ పెళ్ళినాడు ఆ ట్రెయిన్ పడిపోలేదా?" జాన్ బతిమాలుతున్నాడు. "నీ శక్తి సామర్థ్యాలు మాకు తెల్సుగానీ మన సంగతులు, మాగ్గూడా చెప్పరా!"

"మీలెక్క నేనుంటే నేను పర్వేజ్‌నెందుకవుతాను? ప్రవీణ్‌గానే ఉండిపోతాను. హిందుస్తాన్‌లో పుట్టి పాకిస్తాన్ భక్తుడినయ్యాను. జీహాద్‌కోసం జిందగీ మొత్తం వెచ్చిస్తున్నాను..."

"అది సరేరా... అసలు సంగతి చెప్పు..." అంటూ జాన్ లేచొచ్చి ప్రవీణ్ ప్రక్కన కూచున్నాడు." మేము మాత్రం కాశ్మీర్ కనుమలు దాటిరాలేదా? తెలుగు నేర్చుకోలేదా? మేమిప్పుడు ఇక్కడి జనాభాలో కలిసిపోయినం. నువు పుట్టి పెరిగింది హైద్రాబాదులోనే కాబట్టి ఈ ఏరియాకు నిన్ను చీఫ్‌గా అపాయింట్ చేసిరి...."

"అబ్బబ్బా! అవన్నీ ఎందుకురా?" ఇబ్రహీం చెయ్యిబట్టి, లాగి తన పక్కన కూచోబెట్టుకున్నాడు ప్రవీణ్. "మన ప్లాను వినండి. జాగ్రత్తగా వినండి. మరోసారి చెప్పను."

"సరే..." ఎర్రని విస్కీ.. రక్తంలాంటి విస్కీ ప్రవీణ్ గొంతులోకి జారిపోయింది. "మందిరం మటాష్ సంగతి విని పేపర్ల చదివి శ్రావణి ఉరికొస్తుంది. రేపు రాత్రే... దాన్ని సిన్మాకు తీసుకెళ్తా. సినిమా వదలగానే స్టార్ హోటల్లో భోంచేద్దామని మనవాళ్ళ ఆటోలో తీసుకెళ్తా. సిటీ బయట అదీ, దాని కడుపులున్న పిండము నా పిస్టల్ గుళ్లకు ఖతమైపోతరు. మీ కూతుర్నెవరో కిడ్నాప్ చేసి చంపేసిండ్రని మావయ్యకు. ఆయన ఎగిరొస్తడు. ఆ ఫౌజీ అప్పర్ను మనవాళ్ళు కిడ్నాప్ చేసి మన స్థావరానికి తెస్తారు. అక్కడ వాణ్ణి టార్చర్ చేసి రహస్యాలు లాగి చంపిపారేస్తాం. ఈ ఇల్లు ఖాళీ చేస్తా....."

మందు పార్టీ, ముచ్చట్లు సాగుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం ఒంటిగంటైంది. ఒళ్ళంతా గాట్లు పెట్టి ఉప్పుకారం చల్లినట్టుంది. శ్రావణికి. పట్టరాని కోపం.... ఉక్రోషం... పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి. ఒళ్లంతా చెమటతో బెద్రూం చేరుకుంది. గుండెల్లో అణుబాంబులు పేల్తూనే ఉన్నాయి.

భగవంతుడా! వీడింత దగుల్బాజి అని తెలియదు. వీడు నా కలలపంట కాదు, కరుడుగట్టిన తీవ్రవాది. మేకవన్నెపులి. వీని నీడ గూడా... పుట్టబోయే నా బిడ్డమీద పడకూడదు. వీనివల్ల నా దేశానికింక ఎలాంటి హాని జరగరాదు. నా పసుపుకుంకాల కంటే... నాదేశం పచ్చగా ఉండడమే ముఖ్యం. శ్రీమన్నారాయణా ! నీ మందిరాన్ని, నా దేశాన్ని రక్షించుకునే ధైర్యసాహసాలు ప్రసాదించు తండ్రీ !

మొండి ధైర్యంతో, ముక్కుపుటాలెగసి పడుతున్నె. గబ్బుక్కున తిరిగింది.

ప్రాణరక్షణ కోసం ప్రవీణ్ లైసెన్స్‌డ్ పిస్టల్.. డ్రాలోనే ఉంది. గబగబా గుళ్ళు నింపేసింది. భవానిమాత ఫోటో ముందుకెళ్లి భక్తితో నమస్కరించింది.

అయిగిరి నందిని నందిత మోదిని విశ్వవినోదిని.. పెదాల మీదికొచ్చింది. ఆదిపరాశక్తి ఆవహించింది. అడుగులో అడుగుకేస్తూ కిటికీ దగ్గరికెళ్లింది. మొండి ధైర్యంతో ముక్కుపుటా వెగిరి పడుతున్నె.

ధన్....ధన్...ధన్... పిస్టల్ మూడుసార్లు పేలింది.

నుదుటి మీదున్న టికిలీబొట్టు నేలరాలింది.

మూడు ఆర్తనాదాలు... మూడు గుండెల్లోంచి రక్తధారలు.. గది నిండా రక్తం...

అనుకున్న దానికంటే ఐదారు రోజులు ముందు రావడమే నయమైంది... అనుకుంటూ టెలిఫోన్ నెంబర్లు తిప్పుతోంది.... శ్రావణి.

**'జాగృతి' 4, నవంబర్, 2002**
**'దీపావళి ప్రత్యేక సంచిక'**

